క్లుప్తంగా

శాస్త్రోక్తంగా వాగీశ తీర్థుల ఆరాధన



వాగీశ తీర్థుల ఆరాధనలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం : మధ్వ పీఠం పూర్వపు పీఠాధిపతి వాగీశ తీర్థుల ఆరాధన వేడుక శాస్త్రోక్తంగా సాగింది. కర్ణాటక రాష్ట్రం గంగావతి తాలూకా ఆణెగుందిలోని నవబృందావన క్షేత్రంలో వాగీశ తీర్థులు బృందావనస్థులయ్యారు. గురువారం వాగీశ తీర్థుల ఆరాధన పురస్కరించుకుని మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు నేతృత్వంలో ప్రత్యేక పూజోత్సవాలు నిర్వహించారు. ముందుగా వాగీశ తీర్థుల మూల బృందావనానికి నిర్మల్య విసర్జన గావించి పుష్ప, పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం ప్రత్యేక విరులతో విశేషంగా అలంకరించి విశేష పూజలు జరిపించారు. క్షేత్రంలోనే స్వామిజీ రాములోరి సంస్థాన పూజ కానిచ్చారు.

శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన



నందవరం కేజీబీవీలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఎం.కేశవ

నందవరం : అత్యవసర సమయాల్లో మహిళలు, బాలికలు శక్తి యాప్‌ను వినియోగించుకుని రక్షణ పొందాలని ఎస్ఐ ఎం. కేశవ సూచించారు. గురువారం స్థానిక కేజీబీవీలో శక్తి టీం ఆధ్వర్యంలో ఎస్ఐ విద్యార్థినులకు శక్తి యాప్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యాప్‌ను మహిళలు, బాలికలు తమ మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో సమాచారం పోలీసు కంట్రోల్ రూమ్‌కి అందుతుందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు తమ ఫోన్‌ను 5 సార్లు షేక్ చేయడం వల్ల కంట్రోల్ రూంకు కనెక్ట్ అవుతుందని, పోలీసులు ఆపదలో ఉన్న వారికి రక్షణ కల్పిస్తారని వివరించారు. ఏఎస్ఐ నటరాజ్, పోలీసు సిబ్బంది నాగరాజు, నాగన్న, మహిళ పోలీసు ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు అప్పగింత



బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన వన్‌టౌన్ పోలీసులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఖాజీపురలో నివాసముంటున్న ధనుంజయ, పల్లవి దంపతుల కుమార్తె హిందు గురువారం ఆడుకుంటూ తప్పిపోయింది. అదే ప్రాంతంలో తిరుగుతుండగా స్థానికులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పారు. పాప కనిపించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా అక్కడున్న పాపను చూసి తమ పాప అని తెలపడంతో వన్‌టౌన్ పోలీసులు తల్లిదండ్రులకు బాలికను అప్పజెప్పారు.

వీఆర్ఏ మృతి



సిద్దమ్మ (ఫైల్)

ఆదోని రూరల్: మండలంలోని నాగనాథనహళ్లి వీఆర్ఏ టి.సిద్దమ్మ(75) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శివరాముడు మృతిపై సంతాపం తెలిపారు. మట్టి ఖర్చులకు రూ.25 వేలు అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ గుండాల నాయక్, ఆర్ఐ కాశీం, రెవెన్యూ స్పింది వెంకటేశులు, వీరేష్, సిద్దప్ప, కృష్ణ, సన్నప్ప, ఈరన్న, పరిషప్ప, రామంజిని సంతాపం తెలిపారు.

20న మాక్ పాలిసెట్ పరీక్ష

ఆదోని రూరల్: ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పదో తరగతి విద్యార్థులకు మాక్ పాలిసెట్ (మాదిరి పరీక్ష)ను స్థానిక భీమా ఇంజినీరింగ్ కళాశాల (బిట్స్ కాలేజ్)లో నిర్వహిస్తున్నట్టు కళాశాల సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కళాశాలలో పాలిసెట్ మాక్‌టెస్టు నిర్వహణపై మాట్లాడారు. ఏటా తమ కళాశాలలో విద్యార్థులకు ఉచిత పాలిసెట్ కోచింగ్, మాక్ టెస్టు నిర్వహిస్తున్నామని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ సురేంద్రబాబు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జనతా పాలసీతో ప్రయోజనం

కౌతాళం: జనతా యాక్సిడెంట్ పాలసీతో బాధితులకు న్యాయం జరుగుతుందని విశాల సహకార సంఘం పీఏఈ రామరాజు అన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబానికి అండగా విశాల సహకార సంఘం రూ.2లక్షల ఆర్థిక సాయం నామినీకి గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సుళేకేరి గ్రామానికి చెందిన కటిక మాబుసాబ్ తమ సొసైటీలో వ్యవసాయ రుణంతో పాటు జనతా యాక్సిడెంట్ పాలసీని తీసుకున్నాడని దురదృష్టవశాత్తు గత ఏడాది నవంబర్ 19న పొలంలో పనిచేస్తుండగా పాము కాటుకు గురై మృతి చెందాడన్నారు. పాలసీ ఉండడంతో నామినీకి బీమా సొమ్ము రూ.2లక్షల చెక్కు మృతుడి భార్య కటిక మాబీకి అందజేశారు. సంఘం సీఈఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నటికి పూర్తయ్యేను?

- అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణాలు
- పట్టించుకోని ప్రభుత్వం




గురజాలలో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం, కె.పేటలో పనులు మధ్యలోనే నిలిచిన అంగన్‌వాడీ భవనం

నందవరం : మండలంలోని పలు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న నూతన అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు అసంపూర్తిగా నిలిచాయి. మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో 58 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 18 ప్రభుత్వ భవనాలు కాగా 24 అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు. 16 వివిధ ప్రభుత్వ పాఠశాలు, కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. కాగా గతంలో నాడు- నేడు ద్వారా నందవరం మండలంలో కనకవీడు, కే.పేట, గురజాల గ్రామాల్లో రూ.16 లక్షలు చొప్పున మంజూరు చేయడంతో నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. పనులు కొంత మేరకు పూర్తయినప్పటికీ కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణం పూర్తిగా ఆగిపోయాయి. దీంతో వాటి చుట్టూ కంప చెట్లు పెరిగిపోయాయి. పలు చోట్ల కేంద్రాల వద్ద మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ అవికూడా అసంపూర్తిగా ఉండిపోయాయి. అలాగే పలు ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచాయి. భవనాలకు తలుపులు, కిటికీలు, ప్లాస్టింగ్, బండ పరుపు వేయకుండా వదిలేయటంతో ఆయా భవనాలు మందుబాబులకు నిలయంగా మారాయని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి భవనాల నిర్మాణం పూర్తి చేసి వినియోగంలో తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం

ప్రభుత్వం అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు నిధులు కేటాయిస్తే పనులు ప్రారంభిస్తాం. గత ప్రభుత్వం విడుదలైన నిధుల వరకు పనులు చేశాం. నిధులు రాగానే పనులు పూర్తి చేసి భవనాలను ఐసీడీఎస్ వారికి అప్పగిస్తాం.
– నరసింహులు, పీఆర్ ఏఈ, నందవరం

ఊపందుకున్న వరి కోతలు



నదికైరవాడిలో వరి కోతలు కోస్తున్న యంత్రం



నాగలదిన్నె రాఘవేంద్ర స్వామి సర్కిల్‌లో ధాన్యం ఆరబోసుకున్న దృశ్యం

నందవరం : మండలంలో రబీలో దాదాపు 1,250 ఎకరాల్లో వరి పంట సాగైనట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. తుంగభద్ర నదీ తీర ప్రాంతంతో పంట ఎక్కువగా సాగు చేశారు. పంట చేతికి రావడంతో ప్రస్తుతం కోతలు ప్రారంభించారు. రైతులు ఆర్ఎస్ఆర్, ఎన్‌డీఎల్, 555 రకాలు ఎక్కువగా సాగు చేశారు. నదీకై రవాడి, నాగలదిన్నె, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, గురజాల గ్రామాలలో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. కూలీల భారంతో రైతులు వరి కోత యంత్రాల ద్వారా వరి కోతలను ప్రారంభించారు. కోతలు పూర్తయిన రైతులు ధాన్యాన్ని కల్లాలోనే ఆరబోసుకున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వరికి మద్దతు లేకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రూ.2,300 ధర కల్పించినా దళారులు, బయట మార్కెట్‌లో మద్దతు ధర లభించడం లేదు. క్వింటాకు రూ.1,950 నుంచి రూ.2వేలు మాత్రమే చెల్లిస్తున్నారు.

జగనన్న కాలనీలో కేంద్ర బృందం తనిఖీ



కోసిగి పంచాయతీ కార్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం

కోసిగి: స్థానిక సజ్జలగుడ్డం రోడ్డులోని జగనన్న కాలనీలోని జలజీవన్ మిషన్ కేంద్ర బృందం అధికారి మాధవేశ్వరన్ సందర్శించారు. గురువారం స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మెయినుద్దీన్, హౌసింగ్ ఏఈ మంజునాథ్ సమక్షంలో జనన్న కాలనీలో తనిఖీ చేశారు . దాదాపు మూడు లేఅవుట్‌లలో దాదాపు 1500 పైగా ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇందులో హౌసింగ్ కింద 545 ఇళ్లు మంజూరు చేశారు. వాటిలో 12 ఇళ్లు పూర్తి చేసుకోగా మిగిలినవి పునాదులకు పరిమితమయ్యాయి. కాలనీలో జలజీవన్ మిషన్ కింద మొదటి లేఅవుట్‌లో రూ.60.06 లక్షలు మంజూరు కాగా తాగునీటి బోర్లు, గుమ్మీలు, పైప్‌లైన్ వేయించేందుకు రూ.11.32లక్షలు ఖర్చు చేశారు. అలాగే మూడవ లేఅవుట్‌లో రూ.54.69 లక్షలు మంజూరు కాగా రూ.8.82లక్షలు ఖర్చు చేసినట్లు చూపించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం చేరుకుని కోసిగిలో తాగునీటి శాంపిల్స్ పరీక్షించి 8 రకాలు టెస్టులు చేశారు. సురక్షిత మంచి నీటిని అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈఓపీఆర్డీ ఆరూన్ రషీద్, సర్పంచ్ అయ్యమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజు, పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డి, మాణిక్యరాజు, రాజేష్ పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

కౌతాళం: రేషన్‌కార్డుదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డి కోరారు. ఈనెల 30తేదీ లోపు ఈ-కేవైసీ చేసుకోవాలన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఇంకా 7,836 మంది ఈ-కేవైసీ చేయించుకోలేదని, వీరంత తప్పనిసరిగా తమ దగ్గరలోని రేషన్‌షాపు డీలర్లు, గ్రామ వీఆర్‌ఓలు, ఎండీయూ ఆపరేటర్ల దగ్గర ఈ-కేవేసీలు చేయించుకోవాలన్నారు. ఈ-కేవైసీ చేయించుకోక పోతే మేనెలలో రేషన్ రద్దు చేస్తారని చెప్పారు.

పనుల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఆదోని రోడ్డులో నున్న పశువుల ఆస్పత్రిలో నిర్వహించనున్న కుక్కల కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల కోసం చేపడుతున్న పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్‌తో పాటు 40 కెన్నల్స్, ఏసీ,నీటి సరఫరాకు చేపట్టిన పలు పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. నాలుగైదు రోజుల్లో ఆసుపత్రిలో కుక్కలకు కు.ని శస్త్ర చికిత్సల ప్రక్రియను వైద్యులు ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. మున్సిపల్ ఏఈ మదన్ పాల్గొన్నారు.

20న మెగా వైద్య శిబిరం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో ఉన్న సంస్కృతి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 20వ తేదీ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు దాత, ఎస్ఆర్ఐ కాకుబాళ్ నగేష్, ఆవోపా ఆదోని పట్టణాధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. 13 మంది డాక్టర్లు, 25 మంది వైద్య సిబ్బందితో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గుండె, ఎముకలు, గొంతు, ముక్కు, చెవి, కంటివైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సుశీలమ్మ దేవాలయ కమ్యూనిటీ హాల్‌లో ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ హంస) ఎమ్మిగనూరు తాలూకా నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. తాలూకా అధ్యక్షుడిగా డి.జగదీష్, అసోసియేట్ అధ్యక్షుడిగా రామకృష్ణయ్య, ఉపాధ్యక్షుడిగా లక్ష్మయ్య, ఆనందరాజు, కార్యదర్శిగా ఎండీ రఫీక్ అలీ, మహిళా కార్యదర్శిగా సిరాజున్నీసా బేగం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రత్నయ్య శెట్టి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఘుబాబు, సయ్యద్ షఫీ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ కార్మికుల్లో 60 ఏళ్లు పూర్తయిన వారి కుటుంబాల్లో ఒకరికి వారసత్వంగా ఉద్యోగం ఇచ్చి రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ,పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు గోవిందు,రాముడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మస్టర్ కేంద్రంలో మున్సిపల్ కార్మికులు ధర్నా చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుకు అందజేశారు. కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేయడంతో అన్యాయం జరిగిందన్నారు.

వేలం రద్దు చేయండి

కౌతాళం: స్థానిక కమేళా కోసం పాడిన వేలంను రద్దు చేయాలని కౌతాళం కటిక సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు డీఎల్‌పీఓ నూర్జహాన్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. మంత్రాలయం నియోజకవర్గంలోని మంత్రాలయం, కోసిగి, పెద్దకడూబూరు మండలాల్లో లేని జీఓ, గెజిట్ కౌతాళం మండలంలో అమలు చేస్తున్నారని తెలిపారు. చికెన్ షాపులకు ఎటువంటి రుసుం లేదని కౌతాళంలో ప్రత్యేకంగా వసూలు చేస్తున్నారని చెప్పారు. కౌతాళంలో కమేళా మార్కెట్ లేదని, అయినా ఈ ఏడాది వేలం పాటను రూ.1.05లక్షలకు పాడారని, ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేసినా స్పందన లేదనన్నారు. వేలం పాట రద్దు చేయాలని డిమాండు చేశారు. ఖాదర్‌బాషా, వసీం, జాంగీర్, గౌస్ పాల్గొన్నారు.

ఊపిరి ఉన్నంత వరకు జగనన్న వెంటే



ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత

ఆదోని టౌన్: ఊపిరి ఉన్నంత వరకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటానని, వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతానని ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత తెలిపారు. గురువారం తన నివాసంలో ఆమె మాట్లాడారు. తన పదవీ కాలం 49 నెలల పాటు కొనసాగిందన్నారు. తన పదవీ కాలంలో అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, పాలకవర్గసభ్యులు అందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తెలియకుండా ఎవరినైనా ఇబ్బంది పెట్టి ఉంటే మన్నించాలని కోరారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాలో భక్తుల సందడి



ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలి వచ్చి భక్తి శ్రద్ధలతో ఫాతెహాలను సమర్పించారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారు జామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న ఎంఈఓ మెయినుద్దీన్

కోసిగి: 2025–2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల ప్రణాళికను సిద్ధం చేయాలని ఎంఈఓలు మెయినుద్దీన్, శోభరాణి సూచించారు. గురువారం స్థానిక ఎమ్మార్సీలో మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యా సంవత్సరం పూర్తికానున్న నేపథ్యంలో తరగతుల వారీగా విద్యార్థుల మెరిట్ జాబితా తయారు చేసుకోవాలని సూచించారు. 5 ఏళ్లు పూర్తి చేసుకుని అంగన్‌వాడీలో ఉన్న పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు దగ్గరలో ఉన్న ఉన్నత పాఠశాలలో చేర్పించేలా చూడాలని చెప్పారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి




ఎమ్మిగనూరు, ఆదోని ఆర్టీసీ డిపోల ఎదుట నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పీఎండీ.ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 2019 జనవరి భద్రతా సర్క్యులర్‌ను అమలు చేయాలని,ఉద్యోగుల డబుల్ డ్యూటీ నగదును పెంచాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా వేతనాలు చెల్లించాలని,ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లను, రిమూవ్స్‌ను నిలిపివేయాలని కోరారు. అసోసియేషన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు రఫీక్, ముస్తాక్ అహమ్మద్, సంయుక్త కార్యదర్శులు సురేష్, ఎస్పీ ఎంసాహెబ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ఆందోళన

ఆదోని టౌన్: ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం రీజినల్ కార్యదర్శి మద్దిలేటి, సలహాదారుడు లక్ష్మన్న డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1/2019 భద్రతా సర్క్యులర్‌ను అమలు చేయాలని, ఉద్యోగులకు డబుల్ డ్యూటీ అమౌంట్ పెంచాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. ఉద్యోగులపై విధించే అక్రమ సస్పెన్స్, రిమూవల్స్ ఆపాలన్నారు. పారదర్శకమైన ట్రాన్స్‌ఫర్స్ పాలసీని అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు బసవరాజు, హరిబాబు, నాగరాజు, షరీఫ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆదోని అర్బన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని సెయింట్ ఆంథోని పాఠశాలలో విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఆదోని ఇన్‌చార్జి సహాయ అగ్నిమాపక అధికారి రామాంజనేయులు అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ఎమ్మిగనూరుటౌన్: అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు, పాఠశాలల్లోని వంట ఏజెన్సీ మహిళలకు అవగాహన ఉండాలని ఫైర్ ఆఫీసర్ రామాంజనేయులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వీవర్స్ కాలనీ హైస్కూల్‌లో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాలు, వాటిని అదుపులోకి తెచ్చే విధానాలపై అగ్నిమాపక శాఖ సిబ్బంది ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న కామర్తి నాగేషప్ప

ఎమ్మిగనూరుటౌన్: ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ విమర్శించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అములులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ఎంకె శివప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, పట్టణ కమిటీ నాయకులు బజారిరెడ్డి,యుయు నాగేష్,కోటకొండ నరసింహులు, మాబ్బాషా,సోమేష్, ప్రభాకర్,అల్తాఫ్,చంద్రశేఖర్,రఘువీర పాల్గొన్నారు.

తాళిబొట్టు అందజేసిన మాజీ ఎమ్మెల్యే



తాళిబొట్టు, మెట్లను అందజేస్తున్న సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: మండలంలోని అలసందగుర్తి గ్రామానికి చెందిన వీరాంజనేయులు, నాగేంద్ర దంపతుల కుమారుడు, కాబోయే కోడలికి తాళిబొట్టు, కాలి మెట్లను మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అందజేశారు. గురువారం ఆదోనిలోని తన నివాసంలో ఇరు కుటుంబాలకు అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివాహం చేసుకోనున్న పేదవారికి తన వంతు సాయంగా తాళిబొట్టు, మెట్లను అందిస్తామని చెప్పారు. పేదలకు ఆర్థిక సాయం అందించేందుకు ముందుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన అధ్యక్షుడు నల్లారెడ్డి, రామలింగేశ్వరరావు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి ఆర్థిక సాయం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఓ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఖాదర్‌బాషా కిడ్నీ సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకున్నారు. దీంతో ఎస్టీయూ తాలూకా శాఖ ఆధ్వర్యంలో సేకరించిన రూ.1,01,000ను సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, ప్రసన్న కుమార్, బసవరజు గురువారం ఆయనకు అందజేశారు. ఆర్థికంగా చేయూతనిచ్చిన ఉపాధ్యాయులకు ఖాదర్‌బాషా కృతజ్ఞతలు తెలిపారు. సంఘం నాయకులు బాబయ్య, అడివన్న, ఎల్లప్ప, రామచంద్ర,సురేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న ఎస్టీయూ నాయకులు

స్మార్ట్ సోలార్‌తో స్ట్రీట్ లైటింగ్



సోలార్ స్ట్రీట్ లైటింగ్ తయారు చేసిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుధాకర్

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ ఈఈఈ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు స్మార్ట్ సోలార్‌తో స్ట్రీట్ లైటింగ్ సిస్టం, సీసీ టీవీ సర్వీస్ లైన్స్‌ను తయారు చేశారు. ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ సర్వీస్‌లైన్ ఐఓటీ కనెక్టివిటీతో కూడిన స్మార్ట్ సోలార్ స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటుతో విద్యార్థులు విప్లవాత్మక మార్పులు తెచ్చారని తెలిపారు. వీటి వల్ల విద్యుత్ వినియోగం తగ్గిస్తుందని చెప్పారు. ప్రాజెక్ట్ విభాగ అధ్యాపకులు కె. చితాంబరమయ్యశెట్టి, పి.పెద్దరెడ్డి, అధ్యాపక బృందానికి, విద్యార్థులను అభినందించారు.

పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం ఇవ్వాలి



మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపాలిటీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లోనున్న యూనిఫాం, కుట్టుకూలీలతో పాటు కొబ్బెరినూనె ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లప్ప, తాలూకా ఉపాధ్యక్షుడు శివకృష్ణ, ఏఐటీయూసీ కార్యదర్శి తిమ్మగురుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. 9సంవత్సరాలుగా యూనిఫాం కుట్టుకూలీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. నరసింహ,విజయేంద్ర, సుందర్‌రాజు,కుమార్, మారెప్ప పాల్గొన్నారు.

సంక్షిప్తం

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కోసిగి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మీ బాయి, కాత్యాయిని పేర్కొన్నారు. గురువారం స్థానిక 3వ అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్-1 పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సెక్టార్-10లోని 10వ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలతో కలిసి వేర్వేరుగా గర్భిణులు, బాలింతలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయా కేంద్రంలల్లో పౌష్టికాహార స్టాళ్లను ఏర్పాటు చేసి పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డీలర్‌ను నియమించాలి

పెద్దకడబూరు : మండలంలోని కల్లుకుంట గ్రామంలో పర్మినెంట్ డీలర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు రేషన్ సక్రమంగా అందేలా చూడాలని ఏఐవైఎఫ్ డివిజన్ అధ్యక్షుడు జాఫర్ పటేల్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి షేక్షావలి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు గీతా ప్రియదర్శినిని కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రస్తుతం రేషన్ పంపిణీ చేస్తున్న తాత్కాలిక డీలర్ రేషన్ పంపిణీలో విఫలమయ్యారని ఆరోపించారు. తమ కోటాకు వచ్చిన బియ్యాన్ని పంపిణీ చేయకుండానే కార్డుదారులకు బియ్యం అయిపోయాయని చెప్పి రాత్రి సమయాల్లో బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. శాఖాపరమైన చర్యలు తీసుకొని కార్డుదారులకు న్యాయం చేయాలని కోరారు.

జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకోండి

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థినులు జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, మానసిక ఆరోగ్యం ముఖ్యమని సీఎంహెచ్ కౌన్సిలర్ జనార్ధన్‌రాజు సూచించారు. పదవ తరగతి పరీక్షా ఫలితాలు వెలువడనుండటంతో ఫలితాలకు ముందు విద్యార్థినులను మానసికంగా శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు గాను పట్టణంతో పాటు నందవరం, చిలకలడోన,పెద్దకడుబూరు కేజీబీవీల్లోని విద్యార్థినులకు గురువారం పలు అంశాలపై జీసీడీఓ స్నేహలత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వాల్ విజన్ బోర్డ్ ద్వారా పలు అంశాలపై వివరించారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి

కోసిగి: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గిరి, రఘు, రోహిత్, ఉషా, హేమ, మనీషా కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ కింద పని చేసే వివిధ రకాల శాఖల వారిని రెగ్యూలర్ చేశారని, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను మాత్రం నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి మనోజ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. హెల్త్ ఆఫీసర్లు ఉదయ్, యువరాజు, పూర్ణిమా, తిరుమల, రేఖ, శ్రీనివాసులు, యామిని, గీతా పాల్గొన్నారు.